29-1-20

కదలిక

# చాకిరీ చేసినం.. చారానా రాలేదు!

ఎటు చూసినా జనం.. కూలి డబ్బుకోసం ఆరాటం.. పే స్లిప్పుల కోసం వెదుకులాట.. గౌరు యాదమ్మకు పే స్లిప్పు రాలేదు. కోపమొచ్చిందావిడకి. 'తిండికి లేదు. గవర్నమెంటును నమ్ముకుంటె ఇట్ట చావాల్సిందేనా?' – అంది తీవ్రంగా. 'చల్క లేదు.. బువ్వ లేదు.. కష్టం రాలేదు.. ఏం తినం?' – ప్రశ్నిం చింది మిద్దే సూరమ్మ గట్టిగా. మిగిలిన స్త్రీలూ గుండె గొంతుక విప్పారు. వెతల బతుకుల్ని ఏకరువు బెట్టారు. "ముప్పయి కోపులు తీసిన. ముప్పయి రోజులు చేసిన. దుకానంలో వెయ్యి రూపాయలు అప్పు చేసిన. అళ్లు తిడతన్నరు" – వివరించింది బాయికాడి యాదమ్మ. "నేనూ దుకానంలో వెయ్యి అప్పు చేసిన.. పైసా రాలేదు.. అప్పు తీర్లేదు" – అంది దశ్లి. ఇంతలో కుర్రా రాజు ముందుకొచ్చాడు. "పైసలొస్తయని ఉరుక్కుంట ఉరుక్కుంట వచ్చినం. ఏడు నెల్లయినా పైసలివ్వలేదు. అసలు మీరు పొద్దున్నే రావల్సింది. ఈ ఇంటి ముందు రోడ్డు జామయిపోయింది" అన్నాడు. నాటి ఉదయం పే స్లిప్పుల కోసం వందలాది మంది తరలివచ్చిన దృశ్యాన్ని కళ్లకు కట్టినట్టు వర్ణించాడు – ఇది ఆరవ తేదీన రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లోయపల్లి గ్రామాన ఎదురైన అనుభవం. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ ఇంటికి వెళ్లగానే కనిపించిన దృశ్యం. మంచాల మండలంలో వేతనాలు చెల్లింపు పూర్తయిందని అంతకుముందు రోజే పథకం ప్రోగ్రామ్ ఆఫీసరు (పిఓ) సూరిబాబు తెలిపారు. లోయపల్లి కూలీలు మాత్రం అందని వేతనం సాక్షిగా 'ఆయన నిజాలు చెప్పడం లేదు' అంటున్నారు.

వి.ఉదయలక్ష్మి

లోయపల్లి.. మంచాల మండలంలో అత్యధికంగా జాబ్ కార్డులున్న గ్రామం. 90 శాతం వరకూ కూలీలున్న గ్రామం. 1375 మంది కుటుంబాల వారు ఈ గ్రామంలో జాబ్‌కార్డులు పొందారు. 1100 మంది కూలీలు 4000 ఎకరాల్లో 15,000 మట్టికట్టలు నిర్మించారు. ప్రతిఫలాన్ని అందుకునే సందర్భంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు పని చేసిన తర్వాత వారం రోజులకు వేతనం చెల్లించాలి. ఎటువంటి పరిస్థితుల్లోనూ వేతన చెల్లింపు 15 రోజులకు మించగూడదు. కానీ ఈ గ్రామంలో ఇంచుమించు ఏడు నెలలైనా వేతనాల చెల్లింపులు జరగలేదు. పథకంలో పేర్కొన్న సమయంలోపు కూలీ చెల్లించకపోతే కూలీ చెల్లింపు చట్టం – 1936 (4 ఆఫ్1936) ప్రకారం నష్ట పరిహారం పొందే హక్కు ఉందన్న విషయం వారికి తెలియదు. ఈ నేపథ్యంలో సకాలానికి వేతనాలు పొందలేని కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. లోయపల్లి తదితర గ్రామాలకు చెందిన ఇలాంటి వందలాది కూలీలు గత మాసాంతంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన మంచాల మండల కార్యాలయం ముందు ధర్నా జరిపారు. పిఓను రెండు గంటలపాటు నిర్బంధించారు. బహుశా ఈ ఆందోళనా కార్యక్రమాల నేపథ్యంలోనే కావచ్చు.. జనవరి ఐదున లోయపల్లికి చెందిన 500 మంది కూలీల వేతనాల్ని అధికారులు బ్యాంకులో జమ చేశారు. ఫీల్డ్ అసిస్టెంటుకు పే స్లిప్పులు పంపారు. మర్నాటి ఉదయం ఊరి కూలీలు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటికి తరలివచ్చారు. దాదాపు 300 మందికి పే స్లిప్పులు రాలేదని తేలింది. మరోమారు వారిని నిరాశ ఆవిరించింది. తాజాగా ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపిన వివరాల ప్రకారం.. అధికారులు 25వ తేదీన మూడవదఫా పే స్లిప్పులు పంపారు. ఈ సారి కూడా 88 మంది కూలీలకు వేతనాల్ని మినహాయించి మరోమారు వారిని నిరాశపరిచారు. మంచాల మండలంలోని మిగిలిన గ్రామాల పరిస్థితి మరీ ఇంత అన్యాయంగా లేకపోవచ్చు. కానీ ఆయా గ్రామాల్లోనూ వేతనాలు సకాలానికి అందడం లేదు. దాద్‌పల్లి గ్రామాన సెప్టెంబరులో పని చేసిన కూలీలకు జనవరి నాటిగ్గానీ వేతనాలు దక్కలేదు. 'దసరాకొస్తాయనుకున్న కూలి డబ్బులు సంక్రాంతిగ్గానీ రాలేదు' అంటున్నాడు ఆ గ్రామానికి చెందిన జి.శ్రీనివాస్. జాపాల ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ చెబుతున్న దాన్ని బట్టి 'స్వయం సహాయక గ్రూపుల్లోని కూలీలు ఈ పనుల పట్ల అంతగా ఆసక్తి చూపట్లేదు. కూలీ డబ్బులు ఆలస్యం కావడం వల్ల వారం వారం పొదుపు డబ్బులు కట్టేందుకు వారికి వీలవడం లేదు.'

'చట్టం ప్రకారం పదిహేను రోజుల్లోపు వేతనం చెల్లించాలి. కానీ పని ఒత్తిడి వల్ల కూలి డబ్బుల వివరాల్ని మండల కార్యాలయానికి పంపడానికే మాకు పదిహేను రోజులు పడుతోంది.. పైగా మండలంలో ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లకు బదులు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇద్దరు కంప్యూటరు ఆపరేటర్లు అవసరం కాగా ఒకరు మాత్రమే పని చేస్తున్నారు. ఇలాంటి రకరకాల కారణాలు వేతనాల చెల్లింపులో జాప్యానికి కారణమవుతున్నాయి' అంటున్నారు రవీందర్. 'ఒకే ఒక్క పోస్టాఫీసు ద్వారా వేతనాలు చెల్లించే ఏర్పాటు చేయడం.. అనుభవ రాహిత్యం' కూడా ఈ జాప్యానికి కారణమని చెప్పారు పిఓ. ఇక లోయపల్లి విషయానికొస్తే.. ఆ గ్రామం నల్గొండ జిల్లా మర్రిగూడ పోస్టాఫీసు పరిధిలో ఉందనీ, వేతనాల చెల్లింపులో జాప్యానికి అది కూడా ఒక కారణమనీ వివరించారు. ఈ నేపథ్యంలోనే బోడకొండలోని గ్రామీణ బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించే ఏర్పాటు చేశామన్నారు.

కారణాలేమైనప్పటికీ వేతనాల్లో జాప్యం కూలీలను ఆర్థికంగా ఇబ్బందుల పాల్జేస్తోంది. అప్పుల బారిన పడేస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన జిల్లాలో కొన్నిచోట్ల కూలీలు పలు రూపాల్లో ఆందోళన చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నూనె వెంకటస్వామి వెల్లడించిన వివరాలను బట్టి రాష్ట్రంలో పలుచోట్ల వేతనాల కోసం ఆందోళనలు జరిగాయి. దేశంలో ఉపాధి హామీ పథకం బాగా అమలయ్యే నాలుగు జిల్లాల్లో ఒకటిగా ఖ్యాతిగాంచిన ఆదిలాబాద్‌లోనూ పరిస్థితులు ఇలాగే వున్నాయి. 'బేల మండలం కొగ్దూరులో ఆరునెలల పాటు కూలి డబ్బు ఇవ్వలేదు. బేల మండలంలోనూ, ఆదిలాబాద్ మండలంలోనూ వేతనాల కోసం ఆందోళనలు తప్పలేదు' అని వ్యవసాయ కార్మిక సంఘం ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ తెలిపారు. ఈ స్థితిని కొందరు అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనిని రాజకీయం చేయడంగా వారు భావిస్తున్నారని అశోక్ చెబుతున్నారు. లోయపల్లి



పే స్లిప్ వచ్చిందా...?

కూలీల అందోళనకు ఫీల్డ్ అసిస్టెంటు వెంకటేష్‌ను బాధ్యుని చేస్తూ మండలాధికారి ఆయన్ని సస్పెండ్ చేశారు. ఆ తరువాత వెనక్కి తగ్గారు. మరోవైపు పథకం అమలులో అవకతవకల్ని అడ్డుకునేందుకు నిఘా వేస్తున్న సంఘం కార్యకర్తలపై అవినీతిపరులు కక్షగ్ర జేస్తున్నారు. దామరచర్ల మండలంలో అవకతవకల్ని ఎండగట్టినందుకు నల్గొండజిల్లా మిర్యాలగూడ డివిజన్ నాయకులు ధీరావత్ భీమా నాయక్ అధికారపార్టీ కార్యకర్తల చేతిలో కత్తిపోట్లకు గురయ్యారు. దుండగులు ఆయన ఇంటిని కూడా కూలగొట్టారు. ఈ పథకం వల్ల కూలీలపై తమ పట్టు సడలుతుందనే ఉద్దేశంతో కినుక వహిస్తున్న పెత్తందార్లూ ఉన్నారు. శ్రామికవర్గ ప్రయోజనాల్ని / దేశ ప్రయోజనాల్ని కాపాడే క్రమంలో స్వార్థపర శక్తుల నుండి ఇలాంటి సవాళ్లు తప్పవు. వీటిని ఎదుర్కొంటూనే ఉపాధి హామీ పథకం సక్రమ అమలుకు పోరాడాల్సివుంది. ఈ క్రమంలో శ్రామికుల్ని ఎంత శక్తివంతం చేస్తే అంత బాగా ఉపాధి హామీ పథకం జయప్రదమవుతుంది. పథకం ఎంత సమర్థంగా అమలయితే అంత బాగా గ్రామాల అభివృద్ధి జరుగుతుంది. ఇటు శ్రామికుల జీవితావసరాలూ తీరుతాయి. అటు సామాజిక సంపదా పెరుగుతుంది. కాబట్టి దేశాభివృద్ధిని కోరుకునే శక్తులు ఈ దిశలో శ్రామికుల్ని సంఘటితపరచడం అవసరం. అలాంటి మహత్తర కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం వంటి సంస్థల్ని అభినందిద్దాం.

**(రచయిత సిఎస్ఇ (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఇన్విరాన్‌మెంట్) ఫెలోషిప్ గ్రహీత. 'ఎన్ఆర్ఇజిఎ అమలులో పంచాయతీల పాత్ర'పై పరిశోధన చేస్తున్నారు.)**

# అందోళనే ఆయుధంగా...

'ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయించుకునే సందర్భాల్లో ఆందోళన అనివార్యమవుతోంది. కూలి డబ్బులకోసమే కాదు.. పనికోసమూ ఆందోళన చేయాల్సివస్తోంది' అంటున్నారు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నూనె వెంకటస్వామి. ఈయన రంగారెడ్డి జిల్లాలో సంఘం కార్యకలాపాల్ని పర్యవేక్షిస్తున్నారు. అక్కడ జరిగిన – జరుగుతోన్న పలు రకాల ఆందోళనల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. వెంకటస్వామి తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా కీసర మండలం చీర్యాల గ్రామంలో గతంలో 'పనికి ఆహార పథకం' పనులు చేసిన కూలీలకు ఇప్పటికీ వేతనాలు రాలేదు. దీంతో వారు ఉపాధి హామీ పథకం పనుల పట్ల ఆసక్తి చూపడం లేదు. ఈ విషయం అర్థం కాని ఫీల్డ్ అసిస్టెంటు దరఖాస్తులు రావడం లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం మే మాసంలో సంఘం ఆధ్వర్యాన కూలీలు చీర్యాల పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రామసభ జరపాలని, వ్యవసాయ కార్మికుల్ని విశ్వాసంలోకి తీసుకుని వారికి పని చూపాలని కోరారు. కానీ ఇప్పటికీ గ్రామసభ జరపలేదు. పనులూ జరగట్లేదు. మేడ్చెల్ మండలం రావల్‌కోల్ గ్రామం మేజర్ పంచాయతీ. ఇక్కడ ఉపాధి హామీ పనుల పట్ల కూలీలు ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ గ్రామకార్యదర్శి రోజుకు నలభై రూపాయలకు మించి వేతనం రాదంటూ కూలీలను నిరుత్సాహ పరుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సంఘం కార్యకర్తలు గ్రామ కార్యదర్శిని నిర్బంధించారు. జిల్లా అధికారులు ఆయనపై చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ హామీ నెరవేరిన దాఖలాల్లేవు. ఇక రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతాల్లో వేతనాల కోసం ఉధృత ఆందోళనలే జరిగాయి. పూడూరు ఎంపిడిఓ కార్యాలయం వద్ద కూలీలు ఘెరావ్ చేశారు. దండు మైలారంలో జడ్‌పి ఛైర్మన్‌ని ఘెరావ్ చేశారు. ఆరు మాసాలయినా వేతనాలు రాకపోవడంతో లోయపల్లి కూలీలు ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఆందోళనలు జరుగుతున్నాయి. వరంగల్ జిల్లా కేసముద్రంలో 2,500 మంది కూలీలు వేతనాల కోసం ఎంపిడిఓ కార్యాలయాన్ని ముట్టడించారు.